


# రాజు

**మూలవాక్యము:-**

**మార్కు 15:32** ఇశ్రాయేలు రాజగు క్రీస్తు ఇప్పుడు సిలువ మీద నుండి దిగి రావచ్చును. అప్పుడు మనము చూచి నమ్ముదమని యొకరితో ఒకరు చెప్పుకొనిరి. ఆయనతో కూడ సిలువ వేయబడిన వారును ఆయనను నిందించిరి.

యేసు ప్రభువు సిలువలో వ్రేలాడుతుండగా అక్కడ చేరియున్న ప్రజలందరు, ఆయనతో కూడ సిలువ వేయబడిన ఇద్దరు దొంగలు ఆయనను నిందిస్తూ పలికిన మాట నీవు ఇశ్రాయేలు రాజగు క్రీస్తువు గదా అని. అవును యేసుక్రీస్తు రాజు అని వాక్యం స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ అంశాన్ని పరిశుద్ధగ్రంధం నుండి ధ్యానము చేసుకుందాం.

## ❖ ఈ రాజు ఎప్పటి నుండి ఎప్పటి వరకు రాజుగా ఉన్నాడు:-

**1. పురాతన కాలము నుండి రాజు:- కీర్తన 74:12**

పురాతనకాలము మొదలుకొని దేవుడు నా రాజైయున్నాడు. దేశములో మహారక్షణ కలుగజేయువాడు ఆయనే.

**2. సృష్టి ఆరంభము నుండి రాజు:- యెషయా 43:15**

యెహోవానగు నేనే మీకు పరిశుద్ధ దేవుడను ఇశ్రాయేలు సృష్టికర్తనగు నేనే మీకు రాజును.

**3. నిరంతరము రాజు:- కీర్తన 10:16**

యెహోవా నిరంతరము రాజైయున్నాడు. ఆయన దేశములో నుండి అన్యజనులు నశించిపోయిరి.

**4. పరలోకమందు రాజు:- మత్తయి 25:34**

అప్పుడు రాజు తన కుడివైపున ఉన్న వారిని చూచి నా తండ్రి చేత ఆశీర్వదింపబడినవారలారా, రండి; లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి.

**5. సకలయుగములో రాజు: 1తిమో 1:17**

సకల యుగములలో రాజైయుండి, అక్షయుడును అదృశ్యుడునగు అద్వితీయ దేవునికి ఘనతయు మహిమయు యుగయుగములు కలుగును గాక. ఆమేన్.

## ❖ ఈ రాజు ఎలాంటి రాజు:-

**1. మహిమ గల రాజు:- కీర్తన 24:7**

గుమ్మములారా, మీ తలలు పైకెత్తికొనుడి. మహిమ గల రాజు ప్రవేశించునట్లు పురాతనమైన తలుపులారా, మిమ్మును లేవనెత్తికొనుడి.

**2. బలశౌర్యములు గల రాజు:- కీర్తన 24:8**

మహిమ గల యీ రాజు ఎవడు? బలశౌర్యములు గల యెహోవా యుద్ధశూరుడైన యెహోవా.

**3. ఘనమైన రాజు:- మలాకీ 1:14**

నేను ఘనమైన మహారాజునైయున్నాను; అన్యజనులలో నా నామము భయంకరమైనదిగా ఎంచబడుచున్నదని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు. కాబట్టి తన మందలో మగది యుండగా యెహోవాకు

ప్రొక్కుబడిచేసి చెడిపోయిన దానిని అర్పించు వంచకుడు శాపగ్రస్తుడు.

**4. నీతిపరుడు, రక్షణగలవాడు దీనుడైన రాజు:- జెకర్యా 9:9**

సీయోను నివాసులారా, బహుగా సంతోషించుడి; యెరూషలేము నివాసులారా, ఉల్లాసముగా ఉండుడి; నీ రాజు నీతి పరుడును రక్షణగలవాడును దీనుడునై, గాడిదను గాడిద పిల్లను ఎక్కి నీ యొద్దకు వచ్చుచున్నాడు.

**5. ప్రభువు పేరట వచ్చు రాజు:- లూకా 19:38**

ప్రభువు పేరట వచ్చు రాజు స్తుతింపబడును గాక. పరలోకమందు సమాధానమును సర్వోన్నతమైన స్థలములలో మహిమయు ఉండును గాక అని తాము చూచిన అద్భుతములన్నిటిని గూర్చి మహా శబ్దముతో దేవుని స్తోత్రము చేయసాగిరి.

## ❖ ఎవరికి రాజు:-

**1. నీ రాజు:- జెకర్యా 9:9**

సీయోను నివాసులారా, బహుగా సంతోషించుడి; యెరూషలేము నివాసులారా, ఉల్లాసముగా ఉండుడి; **నీ రాజు** నీతి పరుడును రక్షణ గల వాడును దీనుడునై, గాడిదను గాడిద పిల్లను ఎక్కి నీ యొద్దకు వచ్చుచున్నాడు.

**2. నా రాజు:- కీర్త 5:2**

**నా రాజా** నా దేవా, నా ఆర్తధ్వని ఆలకించుము. నిన్నే ప్రార్థించుచున్నాను.

**3. మీ రాజు:- యోహాను 19:14,15**

ఆ దినము పస్కా సిద్ధపరచు దినము; అప్పుడు ఉదయము ఆరు గంటలు కావచ్చెను. అతడు ఇదిగో **మీ రాజు** అని యూదులతో చెప్పగా అందుకు వారు ఇతనిని సంహరించుము, సిలువవేయుము అని కేకలు వేసిరి. పిలాతు మీ రాజును సిలువవేయుదునా? అని వారిని అడుగగా ప్రధానయాజకులు కైసరు తప్ప మాకు వేరొక రాజు లేడనిరి.

**4. మన రాజు:- యెష 33:22**

యెహోవా మనకు న్యాయాధిపతి యెహోవా మన శాసనకర్త యెహోవా **మన రాజు** ఆయన మనలను రక్షించును.

**5. యూదుల రాజు:- మత్త 2:1,2**

**యూదుల రాజు**గా పుట్టినవాడెక్కడ నున్నాడు? తూర్పుదిక్కున మేము ఆయన నక్షత్రము చూచి, ఆయనను పూజింప వచ్చితిమని చెప్పిరి.

**6. ఇశ్రాయేలు రాజు:- యోహాను 1:49**

నతనయేలు బోధకుడా, నీవు దేవుని కుమారుడువు, ఇశ్రాయేలు రాజువు అని ఆయనకు ఉత్తరమిచ్చెను.

7. రాజులకు రాజు: **ప్రక: 19:16**

రాజులకు రాజును ప్రభువులకు ప్రభువును అను నామమును ఆయన వస్త్రము మీదను తొడ మీదను వ్రాయడియున్నది.

**8. యుగములకు రాజు:- ప్రక 15:3**

వారు ప్రభువా, దేవా, సర్వాధికారి, నీ క్రియలు ఘనమైనవి, ఆశ్చర్యమైనవి; **యుగములకు రాజా**, నీ మార్గములు న్యాయములును సత్యములునైయున్నవి;

**ముగింపు:-**

పురాతనకాలము నుండి రాజైయున్న దేవుడు ఆయన సకలయుగములకు రాజు. అలాంటి రాజు ఈ లోకంలోనికి శరీరధారిగా వచ్చినప్పుడు యూదులకు రాజుగా పుట్టాడు(మత్తయి 2:1,2). కాని రాజ కుటుంబములో పుట్టలేదు.
ప్రజలు ఆయనను బలవంతముగా రాజుగా చేసే ప్రయత్నం చేశారు (యోహాను 6:15). కాని ఆయన ఒప్పుకోలేదు.
ప్రవచనము నెరవేర్చబడడం కోసం రాజుగా ఊరేగించబడినాడు(లూకా 19:38). కాని ఊరేగింపునకు గాడిదను ఉపయోగించుకున్నాడు.
నేను యూదుల రాజునని చెప్పుకున్నాడు అనే నేరము ఆయన పైన మోపబడింది. అవును నీవన్నట్టు నేను రాజునే అని పిలాతుకు బదులిచ్చాడు(యోహాను18:37,38). రాజుగా సిలువ వేయబడ్డాడు(యోహాను 19:19). తల మీద ముండ్ల కిరీటము చేతిలో రాజదండముగా రెల్లు కర్రను ఆయకిచ్చారు(మత్తయి 27:29,30). రాజ వస్త్రములు ధరించలేదు కాని తనకున్న వస్త్రములను కూడా సైనికులు పంచుకున్నారు.

రాజులకు రాజు ప్రభువులకు ప్రభువు అయినటువంటి యేసుక్రీస్తు ఈ లోకమునుకు మనుష్యునిగా, దాసుని రూపంలో ఎందుకు అవతరించవలసి వచ్చింది?
పాపానికి శాపానికి బానిసలైన మనలని ఆయన పరిశుద్ధరక్తము చేత విమోచించి, కడిగి పరిశుద్ధులుగా మార్చి, సత్యమందు ప్రతిష్ఠచేసి, ఆత్మ చేత అభిషేకించి రాజులైన యాజకులుగా మనల్ని నియమించి ఆత్మ సంబంధమైన బలులు అర్పించే యాజకులుగా రూపుదిద్ది నశించే ఆత్మలను ఏలాగున ఆయన వెదకి రక్షించాడో ఆలాగున రక్షించి ఆత్మలను మందగా, మందిరముగా మార్చి అన్యజనులు అనే అర్పణ దేవునికి సమర్పించటానికి ఆయన ఈ లోకంలో అవతరించినాడు. ఈ సత్యాన్ని మనము తెలుసుకొని, ఏ ఉద్దేశ్యము చేత నిన్ను నన్ను ఎన్నుకున్నారో. ఆ ఉద్దేశ్యము సాఫల్యతలో ముందుకు కొనసాగడానికి పరిశుద్ధాత్మ దేవుడు మనకందరికి సహాయము దయచేయును గాక!.... ఆమెన్.